క్లుప్తంగా

ఎల్‌ఈడీ లైట్లు అందజేత



సర్పంచ్‌లకు ఎల్‌ఈడీ లైట్లు అందజేస్తున్న ఎంపీడీవో జగదీష్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పలు గ్రామాలకు మంజూరైన ఎల్‌ఈడీ లైట్లను సంబంధిత గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో జి.జగదీష్‌కుమార్ శనివారం అందజేశారు. మండలానికి మొత్తం 297 వచ్చాయని, వీటిని ఒక్కో పంచాయతీకి 11 చొప్పున పంపిణీ చేస్తామని ఎంపీడీవో తెలిపారు. పనిచేయని పాతలైట్ల స్థానంలో వీటిని ఏర్పాటు చేయనున్నారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ



పాలకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, ఐసీడీఎస్ సిబ్బంది

పాలకొండ రూరల్: గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ ద్వారా అందిస్తున్న సేవలను వివరిస్తూ మండల కేంద్రంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దశారత్నం ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయం నుంచి నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన



చంద్రయవలస రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ భాను, తదితరులు

పాలకొండ రూరల్: మండలంలోని ఎల్‌ఎల్ పురం సచివాలయ పరిధిలో గల చంద్రయవలస రహదారి నిర్మాణానికి ఎంపీపీ బొమ్మాలి భాను శనివారం శంకుస్థాపన చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ ద్వారపూడి కుమార్ మాట్లాడుతూ.. ఈ ప్రాంత గిరిజనులు దీర్ఘకాలంగా పడుతున్న రహదారి సమస్యలు పరిష్కరించేందుకు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కృషి చేశారన్నారు. ఐటీడీఏ ద్వారా రూ.50 లక్షలు మంజూరు కావడంతో పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. నిధులు మంజూరు చేసిన ప్రజాప్రతినిధులు, ఐటీడీఏ పీఓ కల్పనాకుమారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోరంగి అంజలి, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి వితరణ



విద్యార్థినులకు అట్టలు, పెన్నులు అందజేస్తున్న దాతలు

కురుపాం: స్థానిక కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)లోని పదో తరగతి విద్యార్థినులకు కళింగవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్తకోట వెంకట సురేష్‌కుమార్, కురుపాం వర్తక సంఘం అధ్యక్షుడు కొత్తకోట రవీంద్రకుమార్ కలిసి శనివారం పరీక్ష సామగ్రి వితరణ చేశారు. పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో తమ తండ్రి నారాయణమూర్తి జ్ఞాపకార్థం విద్యార్థినులకు అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు అందజేశామని వారు తెలిపారు. పరీక్షలు బాగా రాసి, మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో ఇంటికుప్పల కిరణ్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

తల్లీ,కుమారుడు అదృశ్యం

సీతంపేట: మండలంలోని జేపీ దీసరిగూడకు చెందిన తల్లీ,కుమారుడు అదృశ్యంపై అందిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపారు. గ్రామానికి అంగన్‌వాడీ కార్యకర్త ఈ నెల 12న తన కుమారుడిని ఆస్పత్రికి తీసుకువెళ్తానని చెప్పి ఇంతవరకు ఇంటికి చేరుకోలేదని ఆమె భర్త ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వారపుసంత పాట ఖరారు

సీతంపేట: సీతంపేట వారపు సంత వేలంపాట శనివారం నిర్వహించారు. ఈ వేలం పాటలో కె.వినోద్ అనే వ్యక్తి రూ.7.50 లక్షలకు పాట ఖరారు చేసుకున్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ రమేష్, కార్యదర్శి కె. సుదర్శనరావు, తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

కొమరాడ: మండలంలోని కూనేరు చెక్‌పోస్ట్ వద్ద తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు శనివారం నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం

- వైఎస్సార్ చేయూత కార్యక్రమంలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



వైఎస్సార్ చేయూత పథకం చెక్కు నమూనాను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగిస్తున్న పాలన యావత్తు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. స్థానిక బీఎస్‌ఆర్ కళింగవైశ్య కల్యాణ మండపం వద్ద శనివారం జరిగిన వైఎస్సార్ చేయూత కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై, కాసేపు మాట్లాడారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమానికి సీఎం జగనన్న అహర్నిశలు శ్రమిస్తున్నారని, అవినీతికి తావులేకుండా ఆయన కొనసాగిస్తున్న పాలనా విధానాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ప్రతిపక్ష నేతగా ఆయన ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 99 శాతానికి పైగా హామీలను ఆయన నెరవేర్చి ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్నారన్నారు. ప్రతీ ఇంటికి మేలు జరిగేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచిన ఏకైక నాయకుడు మన జగనన్న అని అన్నారు. ఇచ్చిన మాట తప్పని నైజం మన జగనన్నది అయితే ఇచ్చిన మాట తప్పే నైజం చంద్రబాబుది అన్నారు. 2014లో ఎలాగైనా అధికారంలోకి వచ్చేందుకు చంద్రబాబు ప్రజలకు 600 హామీలు ఇచ్చి, వాటిలో కనీసం 10 కూడా సరిగా నెరవేర్చలేదని దుయ్యబట్టారు. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికలప్పుడు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చిందన్నారు. టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా ఆ పార్టీ నేతలు, జన్మభూమి కమిటీల సభ్యుల కాళ్లచుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. దీంతో ప్రజలు ఎన్నో వ్యయప్రయాసలు పడుతుండేవారన్నారు. ప్రస్తుతం జగనన్న తీసుకువచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా పారదర్శకంగా ప్రభుత్వ సేవలు, పథకాలు అందుతున్నాయన్నారు. కోవిడ్ విపత్తు సమయంలోనూ సంక్షేమ పథకాల పంపిణీ ఆగలేదన్నారు. ఎన్నికలప్పుడు మాయమాటలు చెప్పే టీడీపీ నేతలను నమ్మవద్దన్నారు. వైఎస్సార్ సీపీతోనే అన్నివర్గాల అభివృద్ధి, సంక్షేమం అని, మనకు మేలు చేస్తున్న జగనన్నకు అండగా నిలవాలని, ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అనంతరం మండలంలోని 2,970 మంది వైఎస్సార్ చేయూత పథకం లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5.57 కోట్ల చెక్కు నమూనాను ఎమ్మెల్యే విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు మండంగి రాధిక, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, పార్టీ ఎస్సీ, ఎస్టీ సెల్ మండల కన్వీనర్లు సామల మాధవరావు, తోయక గోపాల్, ఎంపీడీవో జి.జగదీష్‌కుమార్, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఆదయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ



రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కురుపాం: మండలంలోని గుమ్మిడిగూడ పంచాయతీ, సింగుపురం గిరిజన గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి శనివారం భూమిపూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధి సాధ్యమన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాలకు సైతం పక్కా రోడ్లు వేయించిన ఘనత సీఎం జగనన్నదేనన్నారు. ప్రస్తుతం ఇక్కడి రోడ్డును రూ.70 లక్షల వ్యయంతో 1.2 కిలోమీటర్ల మేర ఐటీడీఏ ఇంజినీరింగ్ విభాగం అధికారుల ఆధ్వర్యంలో నిర్మించనున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శెట్టి సురేష్, ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ గవర విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ: మండలంలోని దిగువ గుణద వద్ద బీటీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి శనివారం భూమిపూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం, అభివృద్ధితో పాటు గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. మారుమూల గ్రామాలకు సైతం సీసీ రోడ్లు వేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. ప్రస్తుతం రూ.1.95 కోట్ల వ్యయంతో దిగువ గుణద నుంచి బిన్నిడి వరకు రెండు కిలోమీటర్ల మేర, మరో రూ.2 కోట్ల నిధులతో దిగువ గుణద నుంచి గుణదతీలేస్ వరకు రెండున్నర కిలోమీటర్ల మేర, రూ.1.2 కోట్లతో దిగువ గుణద నుంచి సవర గుణద వరకు ఒకటిన్నర కిలోమీటరు మేర, రూ.1.48 కోట్లతో కెమిశిల నుంచి కొరిశీల వరకు 2.7 కిలోటమీటర్ల మేర రోడ్లు నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఫక్రుద్దీన్

వీరఘట్టం: సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌గా ఫక్రుద్దీన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ ఎస్సైగా పనిచేసిన ఎం.గోవింద్‌ను వీఆర్‌కు పంపించారు. మండలంలోని తెట్టంగిలో కేంద్ర సాయుధ బలగాలతో శుక్రవారం కవాతు నిర్వహించారు. అయితే ఈ కవాతులో స్థానిక రాజకీయ నాయకులు కూడా పాల్గొనడంతో ఎస్సై గోవింద్‌పై వేటు పడినట్లు సమాచారం.



ప్రిన్సిపాల్ హరగోపాల్

పాలకొండ: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా హరగోపాల్ శనివారం బాధ్యతలు చేపట్టారు. పొందూరు ప్రభుత్వ కళాశాల నుంచి ఇక్కడకు పదోన్నతిపై వచ్చారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది, అధ్యాపకులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ.. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎస్.రమణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నెల్లిమర్లలో ఇంగ్లిష్ అధ్యాపకుడిగా పనిచేసి, పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు.

వ్యక్తిపై దాడి

సీతంపేట: చిల్లంగి అనుమానంతో ఒక వ్యక్తిపై దాడి చేసిన సంఘటన సీతంపేట మండల ఉప్పరజమ్మిలో చోటు చేసుకున్న సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్సై జగదీష్‌నాయుడు తెలియజేసిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కె. రామస్వామి అనే వ్యక్తికి చిల్లంగి ఉందనే నెపంతో అదే గ్రామానికి చెందిన బిడ్డిక కరయ్య, శ్రీను దాడి చేశారు. దీంతో గాయాలపాలైన రామస్వామిని ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

40 లీటర్ల సారా స్వాధీనం

జియ్యమ్మవలస: మండల పరిధిలోని అల్లువాడ జంక్షన్ వద్ద మోటార్‌బైక్‌పై తరలిస్తున్న 40 లీటర్ల సారాను శనివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చిన్నంనాయుడు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, మండలంలోని చినమేరంగి గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశామన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవిత్ర శనివారం పురస్కరించుకుని, పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు మందిరానికి తరలివచ్చి, స్వామి వారిని దర్శించుకున్నారు. అంతకుముందు భక్తులు తలనీలాలు సమర్పించి, అక్కడి నాగావళి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, మొక్కులు తీర్చుకున్నారు.

పశువుల వ్యాన్ల పట్టివేత

సీతంపేట: నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలిస్తున్న మూడు వ్యాన్‌లను సీజ్ చేసినట్లు ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపారు. ఒడిశా, తదితర ప్రాంతాలను పశువులను తీసుకువస్తుండగా.. శనివారం తనిఖీలు చేపట్టి వాహనాలను సీజ్ చేశామన్నారు. నలుగురు నిందితులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

అమరజీవికి ఘన నివాళులు...



శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు

పాలకొండ రూరల్: ప్రత్యేక రాష్ట్ర సాధనలో అశువులు బాసిన పొట్టి శ్రీరాములు అమరజీవి అని స్థానిక ప్రభుత్వం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మీసాల సూర్యనారాయణ అన్నారు. పాఠశాల ఆవరణలో శ్రీరాములు జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంస్కృత ఉపాధ్యాయయుడు బొరోతు శంకరరావు మాట్లాడుతూ, శ్రీరాములు జీవిత చరిత్రను వివరించారు.

గ్రామాల్లో పోలీస్ కవాతు



పొట్లి గ్రామంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

పాలకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల నగారా మోగడంతో గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పోలీసులు కవాతు నిర్వహించారు. మండల పరిధిలోని అవలంగి, పొట్లి, నవగాం, తదితర గ్రామాల్లో పారా మిలటరీ బలగాలతో పాటు స్థానిక పోలీసులు శనివారం ఫ్లాగ్‌మార్చ్ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ ఎం.చంద్రమౌళి మాట్లాడుతూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు.

పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీలు

కొమరాడ: మండల పరిధిలోని కూనేరు రామభద్రపురం పీహెచ్‌సీలో జిల్లా మలేరియా నివారణ అధికారి టి.జగన్మోహనరావు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆస్పత్రి రికార్డుల నిర్వహణతో పాటు ల్యాబ్‌లో జ్వర నిర్ధారణ పరీక్షలు, వాటి నివేదికలు పరిశీలించారు.

అనారోగ్య సమస్యలతో ఆస్పత్రికి వస్తున్న రోగులకు సత్వరమే వైద్యసేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్యామల్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన బోర్ల మరమ్మతులు

జియ్యమ్మవలస: క్రాస్‌ప్రోగ్రాంలో భాగంగా మండల వ్యాప్తంగా పాడైన బోర్ల మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. శనివారం మండలంలోని పెదమేరంగి గ్రామంలో పనిచేయని బోర్లను బాగుచేసి, వినియోగంలోకి తీసుకువచ్చారు. వేసవి నేపథ్యంలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భరత్‌చంద్ర అన్నారు.

సదా మీ సేవకు ‘సిద్ధం’

- పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థిగా కళావతికి అవకాశం
- హర్షం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

పాలకొండ రూరల్: విశ్వసనీయతకు మారుపేరుగా నిలుస్తూ పాలకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా రెండుసార్లు గెలుపొందిన విశ్వాసరాయి కళావతికి పార్టీ అధిష్టానం మూడోసారి అవకాశం కల్పించింది. ఇడుపులపాయలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి సమక్షంలో శనివారం వెలువడిన జాబితాలో ఆమె పేరు ప్రకటించడంతో నియోజకవర్గం ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2009లో రాజకీయ ఆరంగేట్రం చేసిన కళావతి 2014–19, 2019–2024 మధ్య కాలంలో నియోజకవర్గ శాసన సభ్యురాలిగా పనిచేసి ప్రజల మన్ననలు పొందారు. తాను నిమ్మిన ప్రజలకు, పార్టీకి సేవ చేయాలనే దృఢసంకల్పంతో ముందడుగు వేశారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు ఆమెకు తమ మనసులో స్థానం ఇచ్చారు. నిరాడంబరత, కలుపుగోలుతనం, ఎవరికి కష్టం వచ్చినా తానున్నానంటూ ముందుండే లక్షణాలు ఆమె సొంతం. దీంతో ఎన్నికలు ఎప్పుడువచ్చిన తమ అభిమాన నాయకురాలైన కళావతిని గెలిపించుకునేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారు. అన్నీ మంచి శకునములే అన్న తీరున ప్రస్తుత పరిస్థితులు అన్నీ కళావతి విజయానికి అనుకూలంగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రత్యర్థి పార్టీల్లో సమన్వయలోపం, నాయకత్వం లేమి, కొన్నాళ్లుగా ప్రజలకు దూరంగా ఉండడం వంటి అంశాలు కళావతికి అనుకూలంగా మారనున్నాయి. జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చడంతో పాటు నవరత్నాల పేరిట ప్రతి ఇంటికీ సంక్షేమం అందించడం కళావతికి కలిసివచ్చిన అంశంగా ప్రజలు పేర్కొంటున్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన విద్యావంతురాలు కావడంతో పాటు రాజకీయ కురువృద్ధుడు పాలవలస రాజశేఖం ఆశీస్సులు, యువ నాయకుడు, శాసన మండలి ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ సహచర్యంతో మూడోసారి విజయం ఖాయమని పలువురు జోస్యం చెబుతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ.. ప్రజా సేవకు సిద్ధమని, నిండుమనసుతో ఆశీర్వదించాలని కోరారు.

పాలకొండలో కొత్త ‘కళ’



కత్తులకవిటిలో హర్షం వ్యక్తం చేస్తున్న జెడ్పీటీసీ కన్నతల్లి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

వీరఘట్టం: అనుకున్నట్టుగానే వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా విశ్వాసరాయి కళావతి పేరు ప్రకటించడంతో నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం వచ్చింది. నాలుగు మండలాల్లో సంబరాలు మొదలయ్యాయి. వీరఘట్టం మండలం కత్తులకవిటిలో జెడ్పీటీసీ సభ్యులు జంపు కన్నతల్లి ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళావతి జిందాబాద్, జై జగన్.. అంటూ నినాదాలు చేశారు. కళావతికి హ్యాట్రిక్ విజయాన్ని అందిస్తామని కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. చిదిమిలో దమలపాటి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో కళావతి గెలుపే తమ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ శ్రేణులు నినాదాలు చేశాయి.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మనుమకొండలో భూమిపూజ చేస్తున్న సర్పంచ్ కేశవ

భామిని: మండలంలోని డాబాగూడ, మనుమకొండలలో సీసీ రోడ్లు, సైడ్ వాల్స్, చెరువు గట్ల పనులకు సర్పంచ్ నిమ్మల కేశవ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కాగితాపల్లి కృష్ణారావు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గిరిజన ప్రాంత సమస్యల పరిష్కారానికి పాలకొండ శాసనసభ్యురాలు విశ్వాసరాయి కళావతి చొరవతో నిధులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు తోట సింహాచలం, బోన గడ్డి ధర్మారావు, కొత్తకోట చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భక్తుల పాలిట కల్పవల్లి.. సిరుల ఎల్లమ్మ

- నేటి నుంచి జాతర
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



జాతరు ముస్తాబైన సిరుల ఎల్లమ్మ

పాలకొండ రూరల్: పట్టణంలో వెలసిన సిరుల ఎల్లమ్మ జాతర ఆది, సోమవారాల్లో జరగనుంది. మహా శివరాత్రి తర్వాత రోజు నుంచి ఐదు రోజులు ఎల్లమ్మ జంగిడి తల దాల్చిన పోతురాజు పట్టణ వీధుల్లో ఇంటింటా జోగి సేకరించడం ఆనవాయతీ. అత్యంత పవిత్రంగా భావించే ఐదో రోజు భక్తులు ఎల్లమ్మకు మొక్కులు తీర్చుకుని జాగారాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా యాత్రా ఇతివృత్తాన్ని జముకుల పాట రూపంలో భక్తులకు తెలియజేస్తారు. అష్టమి తిథి రోజున జరిగే ఈ జాతరలో సింధూర కుండ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. అలాగే పాల జంగిడి ప్రదర్శన ఉంటుంది. దీనిని దర్శించుకున్న వారికి మోక్షం లభిస్తుందని భక్తుల నమ్మకం.

జాతర విశేషాలు...

ఆదివారం రాత్రి 7 గంటల నుంచి స్వామివారి తిరువీధి ఉత్సవం కనులపండువగా చేపడతారు. రాత్రి 9 గంటలకు స్వామివారి చరిత్రను జముకుల పాట రూపంలో భక్తులకు వివరిస్తారు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో స్వామివారి సింధూర కుండ ప్రదర్శన, అదేరోజు రాత్రి 9 గంటల సమయంలో పాల జంగిడి దర్శనం ఉంటుంది. రెండు రోజుల పాటు జరిగే యాత్రకు చుట్టుపక్కల మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, సంచార షాపింగ్ మాల్స్, బొమ్మల కొలువులు ఏర్పాటు చేశారు. అలాగే పలు స్వచ్ఛంద, ఆధ్యాత్మిక రంగాల ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఎస్సై ఎస్. ప్రశాంత్‌కుమార్ బందోబస్తు నిర్వహించనున్నారు.

320 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి

పాలకొండ : స్థానిక సబ్ జూనియర్ కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 320 కేసులు పరిష్కారించారని జూనియర్ సివిల్ జడ్జి విజయరాజ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాధితులకు సత్వరం న్యాయం జరిగిలా ఈ లోక్ అదాలత్‌లు దోహదపడుతున్నాయని తెలిపారు. రాజీ మార్గం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

పక్కాగా ఎన్నికల నిబంధనలు..



భామిని: వీఆర్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వరప్రసాదరావు



పాలకొండ: సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ సర్వేశ్వరరావు

పాలకొండ: రానున్న ఎన్నికలకు సంబంధించి మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పక్కాగా అమలు చేయాలని నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అన్నారు. కోడ్ అమలులో భాగంగా స్టాటస్టిక్ సర్వే టీమ్, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది, పోలీస్, రెవెన్యూ సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోడ్ అమల్లోకి రాగానే తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పీఎం, సీఎం, మంత్రుల ఫొటోలు ఉంటే వాటిని తొలగించాలని తెలిపారు. కోడ్ అమల్లోకి వచ్చిన 24 గంటల్లోగా ప్రభుత్వ కార్యాలయాల వద్ద రాజకీయ పోస్టర్లను తొలగించాలని సూచించారు.

కచ్చితంగా..

భామిని: గ్రామాల్లో ఎన్నికల కోడ్ కచ్చితంగా అమలు చేయాలని తహసీల్దార్ పి.వరప్రసాదరావు, ఎంపీడీఓ కె.కిశోర్‌కుమార్ వేర్వేరు సమావేశాల్లో అన్నారు. వీఆర్‌ఓలతో తహసీల్దార్.. కార్యదర్శులతో ఎంపీడీఓ శనివారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బహిరంగ ప్రదేశాలలో రాజకీయ నాయకుల చిత్రపటాలు, బ్యానర్లు తొలగించాలని, అలాగే విగ్రహాలకు ముసుగులు వేయాలని సూచించారు.

గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమలు..

భామిని: అధికారుల సూచనల మేరకు గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి తీసుకువచ్చారు. ఈ మేరకు రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, పోస్టర్లు తొలగించారు. నేరడి–బి సచివాలయం పరిధిలో కార్యదర్శి లోవ అనసూయ ఆధ్వర్యంలో స్టిక్కర్లు, పోస్టర్లు తీయించివేశారు. అలాగే కూడలిలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ముసుగు తొడిగారు,

నియమావళిని పాటించాలి

వీరఘట్టం: ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని ఎంపీడీఓ ఎంవీబీ సుబ్రహ్మణ్యం సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో గతంలో కట్టిన రాజకీయ పార్టీ బ్యానర్లు, ఫ్లెక్సీలను శనివారం సచివాలయ సిబ్బంది సహాయంతో తొలగించారు.